ఇంక శృతిమించి రాగాన పడుతుందని ఒరే నేనే యిలాగ చేయించేనురా అన్నాను.

అ...అ...నువ్వట్రా అనిపించింది, ఇంట్లో డేమ్ ఇన్నట్లు అయ్యేనురా అన్నాడు.

అందుచేత ఒరే ఇంటర్ నేషనల్ ఇడియట్ నువ్వు ఎవ్వరినీ వెక్కిరించకురా! అని వాడిని అన్నాను.

గాజుల పాండురంగారావు

* * *

## గొడుగు

ఒక రాత్రిసమయమునందు ఒక సత్రపు అరుగుపై పరుండి బాటసారి తనగొడుగు మరచి కొంతదూరము పొయెను. అంతలో చినుకులు ప్రారంభమైనవి. గొడుకుకొరకు సత్రము దగ్గరకు వచ్చాడు. అతనువచ్చిన ప్రదేశముననే ఒకస్త్రీ ఒక పురుషుడు సరసము ప్రారంభించినారు. ఆ ప్రదేశములో బాటసారి, వారిరువురుతప్ప మరీ ఎవ్వరూలేరు, బాటసారి మూలనున్న గొడుగునుచూచి మాటలు వినుచుండెను. పురుషుడు "కాంతా! ఏమి నీ చెక్కుటద్దములు! ఏమి నీ కంఠము! ఏమి నీ యందము"అని మెచ్చుకొనగ ఆమె ఇవన్నియు నీవే కదా అనెను. మరల అతడు కాంతా! నీ యుంగరాల ముంగురులు, నీ వాలుజడ, నీ ముద్దు మోము, తీర్చిదిద్దిన కన్నుల సొగసు ఆహా! కన్నులు మూసిన కనబడవు" అనెను. ఆమె మరల అవన్నియు తమవే అనెను. ఏమి నీ కుచకుంభములు యొయ్యారమన్నాడు. అవన్నీ నీ సొత్తేకదా యన్నది. బాటసారి వినలేక విసిగి అన్నియు మీవేగాని ఆ మూలనున్న గొడుగు మాత్రము నాది బాబోయి! అని పెద్దకేక వేసినాడు. ఆ కేకతో కంగారున ఆ జంట పారిపోయినది. బాటసారి గొడుగు తీసుకొని తన దారి తనుపోయాడు.

మద్దుగారు సత్యారావు

## ఆహ్వానానికి ఆగ్రహం

నా ఉద్యోగానికి ఆర్డరు వచ్చింది. టెంపరరీకదా, ఎప్పుడు లాగిపారేస్తారో అని ఒక్కట్లో 200 మైళ్ళు ప్రయాణం చేసి ఉద్యోగంలో చేరుకున్నాను.

రెండునెలలుపోయాక మా అమ్మ, చెల్లెలు వచ్చారు. ఆవేళ నాతో పని చేస్తున్న ఓ స్నేహితుడు, వాళ్ళ ఆడవాళ్ళు మా అమ్మా చెల్లెల్ని చూడటానికి వస్తారని చెప్పాడు.

ఇంటిలో మా అమ్మతో ఈ సంగతి చెప్పి, వాళ్ళొచ్చేసరికి గోధుమపిండి రొట్టెలుతయారుచేయింపించా. (వాళ్ళు మార్వాడీలులెండి! మార్వాడీవాళ్ళకు రొట్టంటె అమితమైన ప్రీతి!)

సాయంత్రమయింది. వాళ్ళు రానే వచ్చారు. ఆడవాళ్లకెదురుగా నేనెందుకెళ్ళటమని మా అమ్మను పంపించా ఆహ్వానించటానికి. మాఅమ్మ "రండి, రండి!"అంటూ లోనికి ఆహ్వానించింది. మరి హిందీ మాటలు రావుగా! ఈ ఆహ్వానం వినేసరికి అగ్గి పర్వతంలా లేచింది ఒకావిడ! (బహుశా నా స్నేహితుని భార్యనుకుంటా!) ఆవిడ యిలా అనటం మొదలెట్టింది—"క్యా ముఝే తూ 'రండీ' కహతీహై? తుమ్ రండీ! తేరీమా రండీ!......" (ఏవిటీ? నన్ను 'రండీ' అంటున్నావా? నువ్వు రండీ! నీ తల్లి రండీ......)

నేనీ ఆగ్రహానికి నివ్వెరపోయా! మా అమ్మ ఏమయిందోనని కాబోలు బిక్కచచ్చిపోయింది!

కాస్సేపయాక నాకంతా అర్థమైంది! ఆమెను తిరిగి సర్దిచెప్పటంతో నా తల ప్రాణం తోక్కొచ్చింది.

'ఇంతకీ హిందీలో 'రండి' అన్న మాటకు అర్థం 'ముండ' అన్నమాట.

ఒకరిభాష ఒకరికి తెలియకపోతే యిలాంటి అనర్థాలే కదా జరుగుతా యనుకున్నాను.

ఆ మర్నాడు ఈకథంతా చెప్పేసరికి మా స్నేహితులు పగలబడి నవ్వారు.

కె. వి. కె. పట్నాయక్

## భలే తమాషా

రామప్పంతులుగారని మాకోతెలుగు పండితులుండేవారు. ఆయన క్లాసులో పాఠం చెపుతుంటే మనుషులే కాదు కదా, రాళ్ళుకూడ తన్మయత్వంతో ఆలకించవలసిందే. పాఠంలోలాగే చేష్టల్లో కూడ హావభావాల్ని ప్రకటిస్తూ మమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చేసేసేవారు. అదే రోజుల్లో పోలయ్య అనే బంట్రోతుకూడ మా బడిలో పనిచేస్తుండేవాడు. పాపం! తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్ళు అనుకునే వట్టి అమాయకుడు. కాస్తో కూస్తో చదువుకున్నాడుకూడాను.

ఇంతకీ అసలేం జరిగిందంటే ఒక రోజు మా పండితుడు సీరియస్‌గా పాఠంచెబుతూ, తక్షణమే కంసుడు కోపోద్దీపమానసుండై ప్రళయకాల రుద్రునివలె కరవాలమును లంఘించి "ఓరీ! సేవకాధమా! నా ఆజ్ఞనే ఉల్లంఘించెదవుగా? ఇదే కాచుకొమ్ము. మదీయ కరవాలముచే నీ కంఠమును తుత్తునియలు గావించెద" నని ఒక్కుమ్మడిగా ఆ సేవకునిపై ఉరికేడని చెబుతూ, అంతకంటె ఎక్కువగా మా పండితుడే ప్రళయకాల రుద్రుడులాగ తయారై చేతిబెత్తంతోసహా ఒక్కగెంతు గెంతారు. ఇహ చూసుకోండి పాపం! అప్పుడే వరండామీద నడుస్తున్న పోలయ్యగుండె బేజారు యెత్తిపోయి గజగజ వణికిపోతూ, శరీరంమీద చైతన్యంకూడ లేకుండా, గద్గదస్వరంతో "బా-బ్బా-బు! నే-నేం-చే-శా-నం-డి! అ!-నే-నేం-చే-య-లే-దం-డి అయ్యో! అ! అంటూ అమాంతంగా పరుగులంకించుకున్నాడు. అంతటితో సరా—గాభరాలో అట్నించివస్తున్న లెక్కల మేష్టార్నికూడ గుద్దేశాడు. ఇదంతా కళ్ళారా చూస్తున్న మేము పొట్ట చెక్కలయ్యేటట్టునవ్వుకున్నాం. అంతేగాదు ఆనాటి విచిత్ర సంఘటన జ్ఞాపకానికొస్తే ఇప్పటికీ నవ్వుకుంటుంటాంకూడాను.

అంగజాల లక్ష్మణరావు